

డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



లెక్క తేల్చారు

జేఎన్‌టీయూకే పరిధిలోని 160 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం 66 వేల సీట్లకు అనుమతి ఇచ్చారు.

8లో

గరిష్టం/కనిష్టం
36.2° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	34.5	28.0
కాకినాడ	36.2	26.6
అమలాపురం	35.0	26.0

న్యూస్‌రీల్

డయల్ యువర్ ఎస్పీకి 19 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమానికి గంట వ్యవధిలో 19 మంది ఫోన్ చేసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేసుకున్న ఎస్పీ సతీష్ కుమార్ సంబంధిత పోలీస్ స్టేషన్లను సిఫార్సు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు.

జీజీహెచ్ ఎఫ్ఎన్‌వో సస్పెన్షన్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ప్రసవం అయిన ఓ మహిళ కుటుంబం నుంచి లంచం గుంజుకున్న ఎఫ్ఎన్‌వో(ఫీమెయిల్ నర్సింగ్ ఆర్డర్లీ)ను కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాలమేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సస్పెండ్ చేశారు. మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ గ్రామీణానికి చెందిన విజయ అనే మహిళ ఐదు రోజులు క్రితం కాకినాడ జీజీహెచ్‌లో ప్రసవానికి చేరింది. వైద్యులు సిజేరియన్ ద్వారా ఆమెకు పురుడు పోశారు. బాలింతగా వైద్య సేవలు కొనసాగుతుండగా ఫోర్త్ యూనిట్‌లోని బాలింతల వార్డులో సేవలందిస్తున్న ఎఫ్ఎన్‌వో కాదా రాణి విజయ నుంచి లంచం తీసుకుంది. ఇవ్వాలని రుబాబు చేస్తూ వేధించింది. ఆమె ఆగడాలను తాళలేక కుటుంబసభ్యులు ఆమె కోరిన మొత్తం ఇస్తూ వీడియో రికార్డు చేశారు. ఆ వీడియోను సోమవారం స్పందనలో కలెక్టర్‌కు చూపి ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎన్‌వో రాణి తంతును కళ్లారా చూసిన కలెక్టర్ తక్షణమే సస్పెండ్ చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కాదా రాణికి మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. గడచిన ఆరు నెలల వ్యవధిలో లంచాలు తీసుకుంటూ ప్రభుత్వ వైద్య సేవల్ని భ్రష్టు పట్టిస్తున్న ఆరుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించారు.

14న దిశ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఈ నెల 13వ తేదీకి బదులు 14న శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఎంపీ వంగా గీత అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని కమిటీ కార్యదర్శి, కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ మార్పును గమనించాలని కోరారు.


14న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

గురువారం జరగవలసిన ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు, సర్వసభ్య సమావేశం 14వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జీఎంసీ బాలయోగి జెడ్పీ సమావేశమందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సభ్యులు, అధికారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

టెక్నాలజీకి అనుగుణంగా పోర్టుల్లో భద్రత కట్టుదిట్టం

కాకినాడ రూరల్: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోర్టుల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేసినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్) కమాండెంట్ డాక్టరు కొండా నరసింహారావు తెలిపారు. కాకినాడ యాంకరేజ్ పోర్టును మంగళవారం ఆయన సందర్శించారు. భద్రతా చర్యలను పరిశీలించారు. ఎస్పీఎఫ్ డీఎస్పీ శ్రీనివాసు, పోర్టు సీఐ జి.శ్రీధర్‌లతో మాట్లాడి పోర్టులో భద్రత గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ జోన్ నుంచి రాజమహేంద్రవరం జోన్‌కు బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రత నిర్వహిస్తున్న వివిధ ప్రదేశాలను తనిఖీ చేశామన్నారు. కమాండెంట్ నరసింహరావును పోర్టు అధికారి ధర్మశాస్త్ర మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన ఓఎన్జీసీ, ఎన్టీపీసీ, శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 16 సమస్యలు



కాకినాడ సిటీ: ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్‌లో నమోదైన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 మంది విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిలైట్లు వంటి సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో కె.శ్రీరమణి, ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల షూ.. అబద్ధాల షో



- జగనన్న కానుక పైనా ఈనాడు విషపు రాతలు
- బూట్ల పంపిణీపై అసత్యాల ప్రచారం
- భూతద్దంలో చూపిస్తూ వాస్తవాలకు సమాధి
- చిన్నపాటి సమస్యపై కొండంత అభాండాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విప్లవాత్మక నిర్ణయాలతో విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వంపై ఈనాడు పచ్చ పైత్యంతో పేట్రేగిపోతోంది. ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమం పైనా విషం చిమ్ముతోంది. చివరకు విద్యార్థులకు సరఫరా చేస్తున్న బూట్లపై కూడా అసత్యాలు వండి వార్చి ప్రభుత్వంపై బురద జల్లుతోంది. 'జగనన్నా... ఈ బూట్లు ధరించలేం' శీర్షికతో ఈనాడు అచ్చువేసిన పిచ్చి రాతలపై వాస్తవాలు విస్తుగొలుపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేని పచ్చ పత్రిక తప్పుడు రాతలపై 'సాక్షి' 'ఫ్యాక్ట్ చెక్'.

వాస్తవం ఏమిటంటే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 4.40 లక్షల మంది చదువుతున్నారు. ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం 'జగనన్న విద్యా కానుక' అందించింది. వరుసగా నాలుగేళ్లుగా ఈ కానుకలు పంపిణీ చేస్తున్నారు. ప్రతి విద్యార్థికీ సుమారు రూ.2,400 వెచ్చించి బ్యాగ్, బూట్లు, బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక డిక్షనరీ, రెండు జతల సాక్స్, మూడు జతల స్కూల్ డ్రెస్, బెల్ట్ ఇస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇండెంట్ పెడుతున్నారు. ఆ సమయంలోనే విద్యార్థులకు జత బూట్లు అందించేందుకు అన్ని తరగతుల విద్యార్థుల పాదాలకు సంబంధించి ప్రింట్ పేపర్ ఆధారంగా కొలతలు తీసుకున్నారు. అవి సప్లై కాగానే స్కూళ్లు తెరచినప్పుడు విద్యార్థులకు వాటిని అందజేశారు.

ఏం జరిగిందో తెలుసుకోకుండానే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 90 శాతం మంది విద్యార్థులకు బూట్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యింది. అక్కడక్కడ కొంత మంది విద్యార్థులకు బూటు సైజు సరిపోలేదు. ఎదిగే వయసు పిల్లలు కావడంతో శారీరక ఎదుగుదలతో పాటు పాదం సైజు కూడా మారుతూండటం సహజం. పై తరగతి పిల్లలకు అందజేసిన బూట్ల విషయంలో కొన్నిచోట్ల ఇబ్బంది రావడం సహజం. జనవరిలో పాదం కొలతలు తీసుకున్నారు. కొలతలు తీసుకుని ఏడు నెలలైంది. కొలతలు పాదం ఇన్నర్ సైజ్ తీసుకోగా, వాటిని బూట్ల తయారీ కంపెనీ బయటి కొలతలుగా భావించడంతో కొందరి సైజులు మారాయి. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా మొత్తం బూట్లన్నీ సరిపోలేదన్నట్టు ఈనాడు తన రాతలతో ప్రజలను కుట్రపూరితంగా తప్పుదారి పట్టిస్తోంది.

ఇదిగో వాస్తవం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తమకు బూట్లు సరిపోవడం లేదని చెప్పినట్టుగా ఈనాడు తన కథనంలో పేర్కొంది. కానీ ఇక్కడ వాస్తవాన్ని దాచిపెట్టింది. ఆ పాఠశాలలో 380 మంది విద్యార్థులుంటే వారిలో 200 మంది బూట్లు అందుకున్నారు. మిగిలిన వారిలో కొద్దిమందికి మాత్రమే బూట్ల సైజులు తేడా వచ్చాయి. పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు అందించారు. చిన్న పాదాలున్న 200 మంది 6, 7, 8 తరగతి విద్యార్థులకు బూట్ల సైజులు సరిపోయాయి. 180 మందిలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల్లో కూడా కొద్ది మందికి మాత్రమే సైజు తేడా వచ్చింది. విద్యా శాఖ అధికారులు వెంటనే దీనిని గుర్తించారు. మళ్లీ కొలతలు తీసుకుని ఆర్డర్ పెట్టారు. త్వరలోనే వారికి కొత్త బూట్లు అందజేస్తామని ఆ మండల విద్యాశాఖాధికారి నాగరాజు 'సాక్షి'కి చెప్పారు.

వాస్తవం ఇలా ఉండగా ఉమ్మడి జిల్లా అంతటా బూట్ల పంపిణీపై ఈనాడు అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్న విద్యా కానుకపై రాస్తున్న పిచ్చి రాతలపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

చాలా కొద్దిమందికే వ్యత్యాసం



పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక అందజేశాం. కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే అక్కడక్కడ బూట్ల కొలతల్లో తేడాలు వచ్చాయి. ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా కొత్త బూట్లు అందిస్తున్నాం. ఇప్పటికే 90 శాతం మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ పూర్తి చేశాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

పాఠశాల తెరవగానే పంపిణీ



ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే విద్యా కానుక కిట్లను సరఫరా చేశారు. ఈ కిట్లలో పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు కూడా ఇచ్చారు. గతంలో ఎప్పుడూ ఇలా కిట్లు ఇవ్వలేదు. జగనన్న ఇచ్చిన బూట్లు వేసుకుని కొత్త యూనిఫాంతో ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లడం సంతోషంగా ఉంది.

– జంగం అఖిల, తామరపల్లి, కె.గంగవరం

బూట్లు బాగున్నాయి



ఈ ఏడాది ఇచ్చిన బూట్లు చాలా బాగున్నాయి. పాఠశాల ప్రారంభమైన తొలి రోజు నాటికే బూట్లు ఇచ్చారు. మాకు ఇచ్చిన బూట్లలో ఎక్కడా లోపం లేదు. మా పాదాలకు సరిగ్గా సరిపోయాయి. జగనన్న విద్యా కానుకలో ఇచ్చిన కిట్లలలో వచ్చిన బెల్ట్, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం అన్ని చాలా నాణ్యతగా ఉన్నాయి.

– కుడుపూడి నిఖిల్, కె.గంగవరం

ఫ్యాక్ట్ చెక్

జిల్లా	బూట్లు	యూనిఫాం	డిక్షనరీలు
తూర్పు	1,22,485	1,21,730	21,091
కాకినాడ	159,890	1,59,794	27,214
కోనసీమ	1,15,322	1,14,833	20,287

పాఠశాల తెరచిన రోజే కిట్ల పంపిణీ



పాఠశాలలు తెరచిన రోజునే జగనన్న విద్యాకానుక పేరుతో పుస్తకాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ, యూనిఫాం అన్నీ కలిపి ఒకే కిట్‌గా అందజేశాం. గత ప్రభుత్వంలో ఇవేమీ ఉండేవి కావు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం పైనే పంపిణీ చేశాం. బూట్లకు సంబంధించి కొన్ని కొలతలు తేడా రావడంతో కొత్తవి ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ

విద్యాకానుక ఒక మైలురాయి



విద్యాపరంగా ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో విద్యాకానుక కూడా ఒక మైలురాయి. విద్యాకానుకలో విద్యార్థులకు నాణ్యమైన బ్యాగ్‌లు, పుస్తకాలు, బూట్లు అందించడంతో పాటు 'నాడు–నేడు'లో పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం పూర్తిగా మార్చింది. సర్కార్ బడుల్లోని విద్యార్థులు పరీక్షల ఫలితాల్లో కార్పొరేట్ తరహాలో దూసుకుపోతున్నారంటే విద్యాపరంగా తీసుకువచ్చిన మార్పులే కారణం.

– ప్రొఫెసర్ ఎ.మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే, విద్యావేత్త

చంద్రబాబు ఏలుబడిలో ఇంత ఖరీదు పెట్టి సర్కార్ బడుల్లో పిల్లలకు యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, సాక్స్‌లు, బెల్ట్‌లు ఇచ్చిన దాఖలాలు లేనే లేవు. పాఠ్య పుస్తకాలు, ఒక జత యూనిఫాం మాత్రమే ఇచ్చేవారు. అదీ కూడా అరకొరగానే. పాఠశాలలో వంద మంది విద్యార్థులు ఉంటే పాతిక మందికి వస్తే గొప్పే అన్నట్లు ఉండేది నాటి పరిస్థితి. ఇప్పుడు పూర్తి పారదర్శకంగా పంపిణీ చేస్తుంటే సాంకేతికంగా ఎదురైన చిన్న సమస్యను భూతద్దంలో చూపి మరీ బురద జల్లుతోంది.

పవన్ మాటల్ని పట్టించుకోవద్దు

- వలంటీర్లకు మాజీ మంత్రి కన్నబాబు హితవు
- పవన్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపాటు



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు మనో ధైర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సభ్యత, సంస్కారం లేకుండా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దూషించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు మండిపడ్డారు. వలంటీరు వ్యవస్థను ఉమెన్ ట్రాఫికింగ్ చేస్తున్న వ్యవస్థలా చిత్రీకరించడం దారుణమన్నారు. కాకినాడ రూరల్, కరప మండలాలలో ఆయన మంగళవారం వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. వలంటీర్లకు ధైర్యం చెప్పారు. సీఎం జగన్‌తో పాటు తామంతా అండగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. బాగా పనిచేస్తుంటేనే నిందలు వస్తాయన్నారు. వాటిని లెక్క చేయకుండా కష్టించి పనియాలన్నారు. అనంతరం మీడియాతో కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 2.80లక్షల మందిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. వారు అద్భుతంగా పనిచేస్తుండడంతో ప్రభుత్వానికి పేరొస్తుందన్నారు. ఇదే పవన్ కల్యాణ్‌కు కడుపు మంటగా ఉందన్నారు. మహిళలు కనిపించకుండా పోతున్నారని, ఉమెన్ ట్రాఫికింగ్ జరుగుతుందని దానికి కారణం వలంటీర్లనడంలో అసలేమైనా పవన్‌కు అలోచన ఉందా ప్రశ్నించారు. 2021 నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ప్రకారం రాష్ట్రంలో ఉమెన్ ట్రాఫికింగ్‌లో ఏపీ 11వ స్థానంలో ఉందన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు వలంటీర్లు కారణమైతే పైనున్న పది స్థానాల రాష్ట్రాలలో అదృశ్యానికి కారణం ఎవరు కారణమని ఆయన ప్రశ్నించారు. వలంటీర్లలో 75 శాతం మహిళలే ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు తొలుత వలంటీరు వ్యవస్థపై దూషణలు చేశారన్నారు. తర్వాత తప్పు తెలుసుకుని వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామన్నారని గుర్తు చేశారు. ఆయన తనయుడు లోకేష్ కూడా పాదయాత్రలో అదే చెబుతున్నారన్నారు. సమావేశంలో రమణయ్యపేట, సర్పవరం, వాకలపూడి, వలపసాకల, సూర్యారావుపేట వలంటీర్లు, ఎంపీడీఓ స్వప్న, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, గోపుశెట్టి బాబ్జీ, సచివాలయాల మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

15న పంపా ఆయకట్టుకు నీటి విడుదల

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఈ ఖరీఫ్‌లో 12,500 ఎకరాల సాగుకు ఈ నెల 15వ తేదీ ఉదయం పంపా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈమేరకు పంపా ఆయకట్టు రైతుల సమావేశంలో నిర్ణయించినట్టు ఆయకట్టు రైతుల నాయకుడు, తొండంగి మండల వైస్ ఎంపీపీ నాగం గంగబాబు మంగళవారం మీడియాకు తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా ఆ రోజు ఉదయం 10–30 గంటలకు నీటిని విడుదల చేస్తారన్నారు. సోమవారం సాయంత్రం రిజర్వాయర్ కార్యాలయం వద్ద ఆయకట్టు రైతుల సమావేశం జరిగింది. నీటి విడుదలకు ముందు పంపా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినట్టు వివరించారు. రైతులతోపాటు ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈ సురేష్, పంపా ఏఈ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

99.20 అడుగుల వద్ద పంపా నీటిమట్టం:

మంగళవారం సాయంత్రం రిజర్వాయర్‌లో 99.20 అడుగుల నీటిమట్టం ఉంది. ఇక్కడ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు. 0.43 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం. ప్రస్తుతం 0.299 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ లోకి 35 క్యూసెక్కులు వస్తోంది. 15న 25 క్యూసెక్కుల నీటిని లాంఛనంగా విడుదల చేస్తామని పంపా ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. తరువాత రైతుల అవసరాలను బట్టి విడుదల చేస్తామన్నారు. నీరు విడుదలకు తేదీ ఖరారు కావడంతో మంగళవారం పంపా ప్రాజెక్ట్ గేట్లు వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రాజెక్ట్ ఏఈ శ్రీదేవి ఆధ్వర్యంలో లస్కర్లు ఈ పనులు నిర్వహించారు.



పంపా రిజర్వాయర్

అట్రాసిటీపై అవగాహన అవసరం

- కలెక్టర్ కృతికా శుక్లా
- జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి దాడులు జరగక్కుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా ఎస్పీ నేతృత్వంలో అట్రాసిటీ దాడుల నివారణతో పాటు, వారధి వంటి వినూత్న కార్యక్రమాల అమలుతో ప్రత్యేకతను చాటుతోందని ఆ శాఖకు అభినందనలు తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. 2020–23లో అట్రాసిటీ కేసులకు సంబంధించి ఈ నెల 7వతేదీ వరకు రూ. 3.24 కోట్లు పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కత్తిపూడి బాలుర హాస్టల్, శంఖవరం బాలుర హాస్టల్, తుని బాలికల హాస్టల్ కొత్త భవనాలకు రూ. 60 లక్షల చొప్పున జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధులను మంజూరు చేశామని, పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పదో తరగతి పిల్లలకు జగనన్న ఆణిముత్యాలు రాష్ట్ర స్థాయి పురస్కారాలు కూడా లభించాయన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలందరూ సామరస్య పూర్వకంగా జీవించేలా చూడాల్సిన అవసరముందన్నారు. సీఎస్సార్, ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్ ఇలా వివిధ వనరుల ద్వారా దాదాపు రూ. 4 కోట్లు సమీకరించి జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు 35 కేసులు దర్యాప్తులో ఉన్నాయని వివరించారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి డీవీ రమణమూర్తి గత సమావేశంలో చర్చించిన అంశాలపై కార్యాచరణను వివరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ మహేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, ఏఎస్పీ పి శ్రీనివాస్, డీఆర్వో కె.శ్రీరమణి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎన్‌వీవీ సత్యనారాయణ, జె.సీతారామరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ అప్పారావు, కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు కె మురళీ కృష్ణారెడ్డి, కె.లతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందే



ఉప్పాడ బీచ్‌రోడ్డ సెంటర్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



పెద్దాపురంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

- పలుచోట్ల ర్యాలీలు, దిష్టిబొమ్మ దహనాలు
- జిల్లావ్యాప్తంగా వలంటీర్ల నిరసనలు

నెట్‌వర్క్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన దుర్మార్గపు వ్యాఖ్యలపై మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా నిరసన కొనసాగింది. తమను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు తామే కారకులమంటూ అర్థం పర్థం లేని మాటలనడంపై నిరసన వ్యక్తం చేశారు. తమకు భేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ వివిధ మండల కేంద్రాల్లో..గ్రామాల్లో వీరు వివిధ రీతుల్లో అందోళన నిర్వహించారు. శంఖవరం, కొంతంగి,కత్తిపూడి,జి.కొత్తపల్లి గ్రామాల వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. రౌతులపూడిలో వలంటీర్లు ప్లకార్డులు పట్టుకుని సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టి పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో వలంటీర్‌లు పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. సామర్లకోట పట్టణ పరిధిలోని పోలీసు రింగ్ స్టేషన్ సెంటర్‌లో వలంటీర్లు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఉండూరు సచివాలయం వద్ద కూడా నిరసన వ్యక్తంచేశారు.పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో భారీ మానవహారం నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేసి నివాళులర్పించారు.



రౌతులపూడి మండలం గుమ్మరేగుల సెంటర్‌లో పవన్ వ్యాఖ్యలకు నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

క్లుప్తంగా

జిల్లా సైన్స్ అధికారులకు శిక్షణ



పుణేలో శిక్షణ పొందుతున్న జిల్లా సైన్స్ అధికారులు

రాయవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా సైన్స్ అధికారులకు మహారాష్ట్రలోని పుణేలో శిక్షణ ఇస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి గిరజాల వెంకట సుబ్రహ్మణ్యం, కాకినాడ జిల్లా నుంచి మైలపల్లి శ్రీనివాస వినీల్, తూర్పు గోదావరి జిల్లా నుంచి జీవీఎస్ శ్రీనివాస నెహ్రూ ఈ శిక్షణ పొందుతున్నారు. వినూత్న ఆలోచనలున్న పాఠశాలల విద్యార్థులను గుర్తించి, భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు గాను వీరికి పుణే సమీపంలోని పాబల్ విజ్ఞాన్ ఆశ్రమంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 13వ తేదీ వరకూ వీరికి ఈ శిక్షణ ఉంటుంది. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను సమర్థంగా వినియోగంలోకి తీసుకు రావడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చదువులో, సామాజికంగా ఏవిధంగా ఉపయోగించాలనే అంశాలపై వీరికి శిక్షణ ఇస్తున్నారు.

2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

మండపేట: రేషన్ బియ్యం అమ్మకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారంతో విజిలెన్స్, పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారులు మండలంలోని కేశవరంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కూసు సత్యనారాయణ ఇంట్లో 42 సంచుల్లో నిల్వ చేసిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని 37వ నంబర్ రేషన్ షాపులో తనిఖీలు చేశారు. స్టాకులో వ్యత్యాసాలున్నట్టు గుర్తించి షాపును సీజ్ చేశారు. ఎండీయూ వెహికల్ స్టాకు రికార్డుల్లో కూడా వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామని మండల సరఫరా అధికారి సుబ్బరాజు తెలిపారు. సత్యనారాయణతో పాటు డీలర్ యు.శేష, ఎండీయూ ఆపరేటర్ పోతురాజుపై కేసులు నమోదు చేశామని ఆయన చెప్పారు.

లెక్క తేల్చారు

- జేఎన్‌టీయూకే పరిధిలో ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య ఖరారు
- ఈ విద్యా సంవత్సరంలో 66 వేల సీట్లకు అనుమతి
- కొత్త కోర్సులలో 500 అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్
- 160 కళాశాలలకు గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ త్వరలోనే విడుదల కానుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ చకచకా జరుగుతోంది. తొలుత సీట్ల సంఖ్యపై వర్సిటీల నుంచి రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి నివేదించిన అనంతరం కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో అత్యధిక కళాశాలల అనుబంధంతో పాటు సాంకేతిక విద్యలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూ–కాకినాడ ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి చేసింది. వర్సిటీ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ సాయిబాబు నేతృత్వంలో ఉన్నత విద్యా మండలికి నివేదిక కూడా పంపించారు. జేఎన్‌టీయూకే పరిధిలో గతంలో పాత ఉమ్మడి జిల్లాలు 8 ఉండేవి. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలు ఈ వర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని కళాశాలలు గత ఏడాది నుంచి కొత్తగా ఏర్పడిన విజయనగరం గురజాడ అప్పారావు సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోకి వెళ్లాయి.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ

ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణ, కళాశాల స్థితిగతులు, వసతులు, విద్యార్థి – అధ్యాపక నిష్పత్తి, క్యాంపస్ కళాశాల పరిస్థితి, ఆటస్థలం, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్ తదితర అంశాలపై ఆన్‌లైన్ తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఏటా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందు వర్సిటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కూడిన నిజనిర్ధారణ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ సిఫారసు మేరకు ఏ కళాశాలకు ఎన్ని సీట్లు కేటాయించాలనే అంశంపై చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటారు.

మరోవైపు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజినీరింగ్ సీట్లలో ఎన్నింటికి వర్సిటీ అనుబంధ గుర్తింపు ఇవ్వాలనే అంశానికి కూడా నిజనిర్ధారణ కమిటీ సిఫారసులే కీలకం. ఈ ఏడాది వర్సిటీ అనుబంధ కళాశాలలపై ఆన్‌లైన్‌లో తనిఖీలు చేపట్టారు.



కాకినాడలోని జేఎన్‌టీయూకే

160 కాలేజీలు.. 66 వేల సీట్లు

గత విద్యా సంవత్సరం వర్సిటీ పరిధిలోని 158 ఇంజినీరింగ్ కళాశాలల్లో 69,245 సీట్లకు బీటెక్ కోర్సులకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 160 అనుబంధ కళాశాలల్లో 66 వేల ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి అనుమతి ఇచ్చారు. గత ఏడాది దాదాపు 30 కళాశాలల వరకూ బీటెక్‌లో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సులో 5 వేల సీట్లకు దరఖాస్తు చేసుకోగా అక్కడి సౌకర్యాలను బట్టి అనుమతి ఇచ్చారు. ఈ ఏడాది కొత్తగా ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వీఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సులకు 500 సీట్ల వరకూ అనుమతి ఇచ్చారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని 27 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం 14,770, ప్రభుత్వ పరిధిలోని జేఎన్‌టీయూకే, ఆదికవి నన్నయ వర్సిటీ కళాశాలల్లో 950 చొప్పున సీట్లు ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధిక సీట్లు, కళాశాలలు ఉన్న జిల్లాగా ఉమ్మడి తూర్పు గోదావరి నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది రాజానగరంలోని ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ కళాశాల కూడా జేఎన్‌టీయూకే అనుబంధంగా నమోదైంది.

సదుపాయాలున్న కళాశాలలకే గుర్తింపు



ఆయా కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి, అన్ని సదుపాయాలూ ఉన్నవాటికే అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకూ సూచించింది. ఆ మేరకు జేఎన్‌టీయూకేలో ఆన్‌లైన్ తనిఖీలు నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు పాటించే కళాశాలలకే గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సమీక్షలోనూ సూచిస్తున్నారు. అన్ని సౌకర్యాలూ ఉన్న కాలేజీలకే గుర్తింపు ఇచ్చాం. అటువంటి కళాశాలల్లో అభ్యసిస్తేనే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కుతాయి.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూ – కాకినాడ

గోదావరిలో పడి యువకుడి మృతి

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన కడలి రమేష్ (35) ప్రమాదవశాత్తూ అదే గ్రామం వద్ద గోదావరిలో పడి మృతి చెందాడు. అతడి మృతదేహం మంగళవారం మధ్యాహ్నం లభ్యమైంది. ఇంటి నుంచి సోమవారం రాత్రి బహిర్భూమికి గోదావరి ఒడ్డుకు వెళ్లిన రమేష్ ఆచూకీ తెలియలేదని అతని కుటుంబ సభ్యులు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నగరం ఎస్సై షేక్ జానీ బాషా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ-స్టాంపింగ్‌పై అపోహలు వద్దు

కాకినాడ లీగల్: ఈ–స్టాంపింగ్‌పై అపోహలు వద్దని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఐజీ ఎ.నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ స్థాయిల్లో భద్రతను పరిశీలించిన తర్వాతే రాష్ట్రంలో వీటితో రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని పేర్కొన్నారు. ఇప్పటికే స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా ఈ–స్టాంపింగ్ విధానం అనేక రాష్ట్రాల్లో అమలవుతోందన్నారు. ఈ విధానంలో ఈ–స్టాంప్‌ను ఎవరు, ఎక్కడ, ఎప్పుడు కొనుగోలు చేశారో వివరాలుంటాయని తెలిపారు. ఈ విధానం వలన పాత తేదీతో స్టాంపుల అమ్మకాలు జరగవని స్పష్టం చేశారు. దీని వలన ప్రజల ఆస్తులకు మరింత రక్షణ ఉంటుందన్నారు. స్టాంపుల కొనుగోలు వివరాలను ప్రజలు స్వయంగా http://www.schilestamp.com, schilestamp (mobile app)లో స్కానింగ్ ద్వారా పరిశీలించుకునే అవకాశం ఉందని తెలిపారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

రామచంద్రపురంలో ఐదుగురి అరెస్టు

అమలాపురం టౌన్: గంజాయి స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అమలాపురంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ వివరాలు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కించు అప్పారావు (ప్రత్తిపాడు మండలం బవురువాక), సంఘటాల రాజేష్ (పిఠాపురం పట్టణం అగ్రహారం), కొప్పిశెట్టి సత్యనారాయణ (రామచంద్రపురం మండలం పెదతాళ్లపాలెం), వాసంశెట్టి బన్నీ (పెదపూడి మండలం చింతపల్లి లాకులు), మర్రెడ్డి వెంకటేశ్వరరావు(కాకినాడ నగరంలోని కొండయ్యపాలెం)లను సోమవారం రామచంద్రపురంలో అరెస్టు చేశారు. వీరి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు రామచంద్రపురంలో గంజాయి అక్రమ నిల్వలకు, సరఫరా, అమ్మకాలకు పాల్పడుతున్నారు. అరెస్టయిన వారిలో కించు అప్పారావు వయస్సు 62 సంవత్సరాలు కాగా, మిగిలిన నలుగురూ 19 నుంచి 20 సంవత్సరాల యువకులే. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ వి.దుర్గారావు, ఎస్సై డి.సురేష్‌బాబులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మూలాలపై ప్రత్యేక దృష్టి

గంజాయిపై జిల్లా పోలీసు శాఖ, స్పెషల్ బ్రాంచి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) బృందాలు జిల్లా వ్యాప్తంగా జల్లెడ పడుతున్నాయని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. గంజాయి కలిగి ఉన్న, తాగుతున్న, అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేస్తూనే.. వారికి గంజాయి ఎక్కడి నుంచి వస్తోందనే మూలాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పాత నేరాల్లో తప్పించుకు తిరుగుతున్న నేరస్తులను గాలించి పట్టుకుని, వారికున్న గంజాయి లింకులపై ఆరా తీస్తున్నామన్నారు. ఈ తరహాలోనే రావులపాలెంలో 2021 నుంచి తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురు పాత నేరస్తులను పట్టుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మన రాష్ట్రానికి ఒడిశా రాష్ట్రం నుంచి ఎక్కువగా గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు గుర్తించామన్నారు. గంజాయి కేసుల్లో పదే పదే నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు గంజాయి షీట్లు తెరుస్తున్నామన్నారు. త్వరలోనే జిల్లాలో కొంత మందిపై ఈ షీట్లు తెరిచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. పాత నేరస్తులపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 32 గంజాయి కేసులు నమోదు చేసి, 133 మందిని అరెస్టు చేశామని ఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.



గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా, రామచంద్రపురం డీఎస్పీ ప్రసాద్

రెండు గేదెలు, దూడ సజీవ దహనం

రావులపాలెం: పశువుల పాక దగ్ధమై పశువులు సజీవ దహనమయ్యాయి. ఊబలంక గ్రామానికి చెందిన నడింపల్లి సూర్యనారాయణరాజుకు గ్రామ సరిహద్దులోని మెర్లపాలెంలో పశువుల పాక ఉంది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ పాకలోని రెండు గేదెలు, ఒక దూడ సజీవ దహనమయ్యాయి. ఒక ఆవుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆరా తీశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు (రావులపాలెం), బోనం సాయిబాబు (ఆత్రేయపురం), రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఊబలంక ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంపై పశువైద్యాధికారులతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఫోనులో మాట్లాడారు. రైతుకు బీమా పరిహారం త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి ఎం.సోమేశ్వరరెడ్డిని ఆదేశించారు.

నర్సరీ అసోసియేషన్‌కు నూతన పాలకవర్గం



నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పోలరాజు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎంపిక పూర్తయింది. తొలి 18 నెలలూ మల్లు పోలరాజు, తరువాత 18 నెలలూ రత్నం అయ్యప్ప అధ్యక్షులుగా సేవలందించేందుకు అంగీకారం కుదిరింది. అలాగే అధ్యక్ష స్థానానికి నామినేషన్ వేసిన పెనుమాక బుల్లికొండయ్యకు ఉపాధ్యక్ష పదవి కేటాయించారు. డైరెక్టర్ పదవులకు 2వ వార్డు నుంచి గాజుల రత్తయ్య, 3వ వార్డు తాడాల నాగేశ్వరరావు, 5వ వార్డు పిల్లా శ్రీనివాస్, 7వ వార్డు అడ్డగర్ల రమేష్, 9వ వార్డు గాదా నాగేశ్వరరావు, 10వ వార్డు నుంచి కొండేపూటి ఎన్‌వీవీ సత్యనారాయణల ఎంపిక ఏకగ్రీవమైంది. వీరు మూడేళ్ల పాటు సేవలందిస్తారు. 1వ వార్డు నుంచి రావిపాటి రామకృష్ణ, పాటంశెట్టి శేషకుమార్; 4వ వార్డు నుంచి జంగా సుబ్బారావు, బోడపాటి గోపాలకృష్ణ; 6వ వార్డు నుంచి గట్టా కృష్ణభగవాన్, బోడపాటి సత్యనారాయణ; 8వ వార్డు నుంచి గరగ నాగేశ్వరరావు, మల్లు శివన్నారాయణ; 11వ వార్డు నుంచి తాడాల బాలమురళీకృష్ణ, రత్నం మహాలక్ష్మీ నాయుడు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. వీరిలో మొదటి వారు మొదటి 18 నెలలు, రెండోవారు తరువాత 18 నెలలూ పదవీ బాధ్యతలు నిర్వహించే విధంగా ఎన్నికల నిర్వహణ కమిటీ ఎదుట అంగీకారం కుదిరింది. కో ఆప్టెడ్ మెంబర్‌గా బీసీ సామాజికవర్గానికి చెందిన నర్సరీ రైతును ఎంపిక చేసి, త్వరలోనే ప్రకటిస్తామని ఎన్నిక కమిటీ తెలిపింది.

కూరగాయలే.. సోయగాల మాలికలై..



సమస్త మానవాళికీ ఆహారాన్ని అందించే జగన్మాత సరికొత్త రూపంలో దర్శనమిచ్చారు. మనిషి ఆకలిని తీర్చే వివిధ రకాల కూరగాయలతో రూపొందించిన మాలికలు ధరించి.. దర్శించుకున్న వారిని శాకంబరీదేవిగా పరవశుల్ని చేశారు. అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారిని ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు, ధర్మకర్తల ఆధ్వర్యాన 20 రకాల కూరగాయలతో మంగళవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక గణపతి కూరగాయల మార్కెట్ కమిటీ టన్ను కూరగాయలు అందించింది. ఈ కూరగాయలతో అమ్మవారితో పాటు అంతరాలయం, ముఖ మంటపమంతా కూరగాయలతో అందంగా అలంకరించారు. దీంతో రోజా పూల తోరణాలు కనిపించే ఆలయం సరికొత్త శోభతో తొణికిసలాడింది. శాకంబరిగా అలంకృత అయిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

– అమలాపురం టౌన్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పిఠాపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన కల్యాణ్ పిఠాపురం బైపాస్ రోడ్డులోని ఒక కల్యాణ మంటపంలో వంటలు చేయడానికి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున బయటకు వచ్చి రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన గౌతమ్

ఉండ్రాజవరం: స్కూలుకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన ముప్పిడి గౌతమ్ (15) ఉండ్రాజవరం మండలం వేలివెన్నులోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో 10వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన గౌతమ్ సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌతమ్ ఆచూకీ కోసం తల్లిదండ్రులు, గ్రామస్తులు మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున స్కూల్‌కు చేరుకుని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో స్కూలుకు యాజమాన్యం తాత్కాలికంగా సెలవు ప్రకటించింది. గౌతమ్ నిడదవోలు పాటి మీద సెంటర్‌లో స్కూల్ బస్ దిగి బస్టాండ్ వైపు నడచి వెళ్తున్నట్టు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించినట్టు ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు తెలిపారు. తండ్రి ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. గౌతమ్ ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు 08819-234433, తనకు 94407 96643, సీఐకి 94407 96659 నంబర్లలో ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ఐదుగురికి జైలు

ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా

జగ్గంపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురికి పెద్దాపురం కోర్టు న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, తాగి వాహనాలు నడుపుతున్న 12 మందిని పట్టుకుని, కేసులు నమోదు చేశామని చెప్పారు. వీరిలో మరో ఏడుగురికి ఒక్కక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై విద్యాసాగర్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా మండలంలోని జె.కొత్తూరు శివారున సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి, 10 లీటర్ల సారా తరలిస్తున్న గళ్ల ఉమామహేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. నిందితుడిని కోర్టుకు తరలించామన్నారు.